తెలంగాణ ప్రజావారధి

ప్రతి అడుగు నిజం వైపు

www.telanganaprajavaradhi.com

తెలుగు దినపత్రిక





హైదరాబాద్ ఆదివారం 28 - 06 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 2


# శ్రీచైతన్య స్కూల్ ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోండి

## ఎంఈవోకు తల్లిదండ్రుల ఫిర్యాదు

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ చైతన్య స్కూల్ ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తల్లిదండ్రులు శనివారం ఎంఈవో సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వినియోగదారుల సంఘాల కార్యదర్శి పోచం సోమయ్య మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యం ఇష్టారాజ్యంగా ఫీజులను పెంచిందని, ఒకే తరగతి విద్యార్థులకు వేర్వేరుగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను మోసం చేయడంతో పాటు దోపిడీకి పాల్పడుతుందన్నారు. గతంలో పలుమార్లు ఖచ్చితమైన ఫీజుల పట్టిక ప్రదర్శించాలని విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు కోరినా ఇప్పటివరకు ఫీజుల వివరాలు పాఠశాల యాజమాన్యం తెలపడం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో నోటుబుక్స్ అమ్మవద్దని ఆదేశాలు ఉన్నప్పటికీ 8వ తరగతి విద్యార్థికి నోట్



బుక్స్‌ను రూ.10600 రూపాయల ధర నిర్ణయించి ముక్కు పిండి వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రాజెక్టుల పేరుతో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. స్కూల్ ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. పాఠశాలను సందర్శించి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఎంఈవోకు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ ఎలగందుల అమరేందర్, పెండెం నరహరి, పసునూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# శాలిగౌరారం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

## అధ్యక్షునిగా నిమ్మల ఆంజనేయులు ప్రధాన కార్యదర్శిగా కప్పల శ్రీకాంత్







**ప్రజావారధి/శాలిగౌరారం**

శాలిగౌరారం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నిమ్మల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా కప్పల శ్రీకాంత్, కోశాధికారిగా మురారిశెట్టి కరుణాకర్, ఉపాధ్యక్షులు-1 దామెర్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు -2 వడ్లకొండ బిక్షం, సహాయ కార్యదర్శిగా జోగు శ్రీనివాస్, జాయంట్ కోశాధికారిగా గుండ్ల రామ్మూర్తి, ఎల్‌సిఐఎఫ్ కోఆర్డి నేటర్‌గా గుజిలాల్ శేఖర్ బాబు, జీఎంటీ కోఆర్డినే టర్‌గా బండారు శంకర్, జీఈటీ కోఆర్డినేటర్‌గా చిర్రబోయిన రమేష్, జీఎల్టీ కోఆర్డినేటర్‌గా రాపాక రాజు, జీఎస్టీ కోఆర్డినే టర్‌గా కందుకూరి భీష్మాచారి, లయన్ టేమర్‌గా వలిశెట్టి దశరథ, మహిళా ప్రతిని ధులుగా యారాల పద్మ, గండూరి విజయలక్ష్మి, ముఖ్య సలహాదారులుగా రామడుగు వెంకట్రామ శర్మ, నిమ్మల వీరస్వామి తో పాటు మరో 10 మంది ని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ ప్రమాణ స్వీకారం జూలై 1 న సాయంత్రం 6 గంటలకు శాలిగౌరారం లో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

# శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి రండి

## భువనగిరి ఎంపీ చామల, మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌కు ఆహ్వానం





**ప్రజావారధి/మోత్కూరు**
మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవం, వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్ కుమార్‌లను శనివారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వానించారు. ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌లకు ఆహ్వాన పత్రికలు అందజేసి కల్యాణోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, దేవాలయ కమిటీ ప్రతినిధులు ముప్ప వెంకట్ రెడ్డి, దామెర సోమయ్య, బండారు రాజేంద్రప్రసాద్, మొగుల్లపల్లి సోమయ్య, ముప్ప తిరుమల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఏల ఉప్పలయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మోత్కూరు మున్సిపల్ సిబ్బంది

# పీఎఫ్ పైసల్ జమ చేస్తలే

### సుమారు రూ.43 లక్షలు పీఎఫ్ సొమ్ము జమ చేయని వైనం




- 2025 జనవరి నుంచి జమ చేయని మున్సిపల్ అధికారులు
- నెలనెలా సిబ్బంది వేతనం నుంచి రూ.1800 కట్
- సిబ్బంది సొమ్మూ లేదు.. మున్సిపల్ వాటా లేదు
- అవసరానికి వాడుకోలేక సిబ్బంది ఆర్థిక ఇబ్బందులు

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపాలిటీలో పని చేస్తున్న సిబ్బంది ఖాతాల్లో పీఎఫ్ సొమ్ము జమ కావడం లేదు. సిబ్బంది వేతనం నుంచి నెలనెలా పీఎఫ్ (ప్రావిడెంట్ ఫండ్) కింద కొంత డబ్బు కట్ అవుతున్నా ఆ సొమ్ము మాత్రం వారి ఖాతాల్లో జమ చేయడం లేదని తెలిసింది. సుమారు 17 నెలలుగా వారి జీతాల నుంచి పీఎఫ్ డబ్బు కట్ అవుతున్నా ఆ సొమ్ముతో పాటు మున్సిపాలిటీ నుంచి జమ చేయాల్సిన డబ్బులు కూడా జమ కావడం లేదంటున్నారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్న సమయంలో అవసరానికి పీఎఫ్ సొమ్ము డ్రా చేసుకుని వాడుకోలేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

### 2025 జనవరి నుంచి జమ చేయని మున్సిపల్ అధికారులు

మోత్కూరు మున్సిపాలిటీలో 70 మంది సిబ్బంది పని చేస్తున్నారు. అందులో 40 మంది సఫాయి సిబ్బంది కాగా, మరో 30 మంది పంపు డ్రైవర్లు, బిల్ కలెక్టర్లు, ఎలక్ట్రీషియన్లు, కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీస్ అటెండర్లు ఉన్నారు. ఒక్కో కార్మికుడికి నెలకు రూ.16600 వేతనం కాగా, పీఎఫ్ రూ.1800, ఈఎస్ఐ రూ.300 కట్ అయి రూ.14500 వేతనం వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. 2025 జనవరి నుంచి పీఎఫ్ డబ్బులు సిబ్బంది ఖాతాల్లో జమ కావడం లేదని చెబుతున్నారు. 70 మంది ఉద్యోగుల నుంచి రూ.1800 చొప్పున నెలకు రూ.ఒక లక్షా 26 వేలు పీఎఫ్ కింద కట్ అవుతున్నాయి. 17 నెలలుగా రూ.21 లక్షల 42 వేలు సిబ్బంది పీఎఫ్ వాటా సొమ్ము వారి ఖాతాల్లో వేయడం లేదు. సిబ్బంది వాటా సొమ్ముకు యజమానిగా మున్సిపాలిటీనే ఉన్నందున మున్సిపాలిటీ నుంచి కూడా రూ.21 లక్షల 42 వేలు కలిపి జమ చేయాల్సి ఉంది. దీంతో 17 నెలలకు సిబ్బందికి పీఎఫ్ కింద రూ.42 లక్షల 84 వేలు చెల్లించాల్సి ఉంటుంది. పెద్ద మొత్తంలో పీఎఫ్ బకాయిలు పేరుకపోవడంతో సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది వేతనాల నుంచి 17 నెలలుగా కట్ అవుతున్న పీఎఫ్ సొమ్ము కూడా వారి ఖాతాల్లో జమ చేయలేదంటే ఆ డబ్బులు ఏమయ్యాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 17 నెలల పీఎఫ్ బకాయిల్లో సిబ్బంది కనీసం ఆరు నెలల పీఎఫ్ సొమ్ము సుమారు రూ.22 వేలు డ్రా చేసుకునే అవకాశముంటుంది. మున్సిపాలిటీలో పనిచేసే సిబ్బంది అంతా ఎస్సీ, బీసీలే కావడంతో ప్రస్తుతం పిల్లల ఫీజులకు, పుస్తకాలకు ఇబ్బందులు పడుతున్నామని, పీఎఫ్ సొమ్ము డ్రా చేసుకునే అవకాశం ఉంటే కొంత ఆర్థిక ఇబ్బందులు తప్పేవని, బయట ఎక్కడా అప్పు పుట్టడం లేదని వాపోతున్నారు.

### అధికారుల ఇష్టారాజ్యం..?

మున్సిపాలిటీకి సుమారు ఏడాదికి పైగా పాలకవర్గం లేకపోవడంతో మున్సిపల్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తున్న ఫండ్స్‌పై అడిగే వారు లేకపోవడంతో అధికారులు ఆడిందే ఆట..పాడిందే పాటగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. అధికారుల స్వప్రయోజనాలు, కొందరు కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో చూపిన శ్రద్ధ మున్సిపల్ సిబ్బంది ఆర్థిక, సామాజిక భద్రతలో చూపించలేదని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. సిబ్బందికి బకాయి ఉన్న పీఎఫ్ సొమ్ము రూ.43 లక్షలు వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### నిధులు సర్దుబాటు అయ్యాక చెల్లిస్తాం

**-జి.నర్సయ్య, మున్సిపల్ కమిషనర్, మోత్కూరు**

మున్సిపల్ సిబ్బంది పీఎఫ్ సొమ్ము నిధులు లేని కారణంగా గత కమిషనర్ పెండింగ్‌లో పెట్టారు. నిధులు సర్దుబాటు అయ్యాక సిబ్బంది ఖాతాల్లో జమ చేసి వారికి చెల్లిస్తాం.